# తుంపర సేద్యం..



# మెట్ట రైతుకు లాభం



హుస్నాబాద్ మండలం మడద గ్రామ శివారులో స్ప్రింక్లర్ల ద్వారా మొక్కజొన్న పంటపైకి వెదజల్లుతున్న నీరు

- సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు, శ్రమ ఆదా
- డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం పై రైతుల ఆసక్తి

హుస్నాబాద్, డిసెంబర్ 20 : వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

### తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు

తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600ల వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలను నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి.

### స్ప్రింక్లర్ల అమరికలో మూడు విధానాలు

స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకునే అవకాశం ఉంది. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం అయితే కొన్ని పైపులను మాత్రం భూమి లోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చుకోవడం రెండో విధానం. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఈ విధానం ద్వారా పైపులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించి వీలైనన్నీ పంటలకు తుంపరసేద్యం ద్వారా నీరందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైనది స్ప్రింక్లర్ హెడ్. ఇందులో రెండు రంధ్రాలు ఉంటాయి. ఒకటి 4 నుంచి 5.6మిల్లీమీటర్ల సైజు ఉండగా ఇంకోటి 3.13 మిల్లీమీటర్ల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసం గల భూమిని మాత్రమే తడుపుతుంది.



అక్కన్నపేట మండలం చౌటపల్లిలో స్ప్రింక్లర్ల ద్వారా దుక్కిని తడుతుపున్న రైతులు



హుస్నాబాద్ పట్టణ శివారులో డ్రిప్ ద్వారా పత్తి పంటకు నీరందిస్తున్న దృశ్యం

### బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే లాభాలు

- తుంపర సేద్యం విధానంలో పంట పొలంలో పొలం గట్లు, కాల్వలు, మడులు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో రైతుకు ఉన్న భూమి విస్తీర్ణం మొత్తం పంట సాగు చేయవచ్చు.
- సంప్రదాయ నీటి పారకం విధానంతో పొలం గట్లు, కాల్వ గట్లకు సుమారు 35శాతం నీరు వృథాగా పోతుంది. స్ప్రింక్లర్ల వాడకంలో ఈ నష్టం ఏమాత్రం ఉండదు.
- రైతు సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి.
- స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా భూమి లోపలి పొరల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. ముఖ్యంగా ఇసుక నేలల్లో ఈ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది.
- మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఇవ్వొచ్చు.
- స్ప్రింక్లర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది.
- తుంపర సేద్యం ద్వారా ఎగుడు, దిగుడుగా ఉన్న నేలల్లోనూ పంటలు పండించొచ్చు.
- స్ప్రింక్లర్ ద్వారా నీరు వర్షంలా పడటంతో పంట చుట్టుపక్కల వాతావరణం చల్లగా మారి అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటను కాపాడుకోవచ్చు.
- డ్రిప్ సిస్టం ద్వారా పలు రకాల పండ్లతోటలను విరివిగా పెంచుకునే అవకాశం ఉంది.
- బిందు సేద్యం(డ్రిప్) వల్ల 30 నుంచి 40 శాతం కరెంట్, 30 నుంచి 40 శాతం ఎరువులు ఆదా అవుతాయి.
- ఎత్తు పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకు ఒకే మోతాదులో నీరు అందడం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది.
- బిందుసేద్యంతో భూమి కోతకు గురికాకుండా, భూసారం కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఉంటుంది.

### దిగుబడి పెరుగుతుంది..



బిందు, తుంపర సాగు విధానంతో పంటకు సమయానికి సరిపడా నీరు అంది పంట ఏపుగా పెరుగుతుంది. దీంతో పంట దిగుబడులు సాధారణం కంటే ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. పాత పద్ధతిలో పంటకు నీరందించాలంటే ఎక్కువ నీరు వృథా అవుతుంది. తక్కువ నీటి వనరులు ఉన్న మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, తుంపర సేద్యానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటలు వేసే రైతులు ఈ మార్గాన్ని ఎంచుకోవడం ఎంతో మంచిది.

- పి మహేశ్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, హుస్నాబాద్

### సులభ పద్ధతుల్లో దిగుబడులు పెంచుకోవాలి



రైతులు తక్కువ శ్రమ, తక్కువ సాగునీటి వినియోగం లాంటి సులభ పద్ధతుల్లో పంటలు సాగు చేసి దిగుబడులు పెంచుకోవాలి. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటకు సరిపడా నీటిని అందించడంతో పాటు శ్రమ, సమయం కలిసొస్తుంది. పంటకు స్ప్రింక్లర్లను అమర్చి కొంత సమయాన్ని ఇతర పనులకు కేటాయించుకునే అవకాశం ఉంది. తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్న డ్రిప్, స్ప్రింక్లర్లను ఆరుతడి పంటల సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నా.

-ఆలేటి కొండల్‌రెడ్డి, రైతు, పోతారం(ఎస్), హుస్నాబాద్ మండలం



జహీరాబాద్ పట్టణ శివారులో రైతులు సాగుచేస్తున్న పచ్చిమిర్చి , టమాట



# వాణిజ్య పంటల సాగుకు రైతన్నల ఆసక్తి

## యాసంగిలో ఆరుతడి పంటల సాగు మేలంటున్న అన్నదాతలు

- న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో తెల్లజొన్న, శనగ సాగు
- జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో ఆలుగడ్డ సాగు
- పెరిగిన కూరగాయలు, పూల సాగు
- మార్కెట్‌లో ధర ఉన్న పంటలు సాగు చేస్తున్న రైతులు
- పంట మార్పిడితో ఆధిక దిగుబడులు
- వాణిజ్య, కూరగాయలకు ఎర్రనేలలు అనుకూలం

జహీరాబాద్, డిసెంబర్ 20: యాసంగిలో అన్నదాతలు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. వానకాలనంలో పుష్కలంగా వానలు కురవడంతో వ్యవసాయ బావుల్లో నీరు ఉండడంతో ఆరుతడి పంటలు జోరుగా సాగుచేస్తున్నారు. జహీరాబాద్ వ్యవసాయ శాఖ డివిజన్‌లో వానకాలంలో రైతులు అధికంగా పత్తి, కంది, మొక్కజొన్న, సోయా పంటలు సాగు చేశారు. రెండో పంట సాగు చేసేందుకు భూములు సిద్ధం చేసి సాగు చేస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా పడే శనగ, జొన్న పంటలు అధికంగా సాగు చేస్తున్నారు. మరికొందరు మొక్కజొన్న, కూరగాయలు సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకులంగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. రైతులు యాసంగిలో పంట మార్పిడి చేసి, కొత్త పంటలు సాగు చేస్తున్నారు. ఎర్ర నేలలు వాణిజ్య, ఆకుకూరలు, కూరగాయలకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా కొత్త పద్ధతుల్లో బిందుసేద్యం ద్వారా పంటలు పండిస్తున్నారు. అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్నారు. వేసవిలో భారీ అమ్మకాలు జరిగే పుచ్చకాయలు సాగు చేస్తున్నారు. బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అధికంగా ఆదాయం వచ్చే వాణిజ్య పంటల సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు.

### జోరుగా శనగ, జొన్న పంట సాగు

వానకాలంలో సాగు చేసిన పత్తి పంటను తీసుకొని వ్యవసాయ బావుల వద్ద రైతులు రెండోపంటగా శనగ, తెల్లజొన్న, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేస్తున్నారు. పత్తి పంటను అధికంగా న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో సాగు చేశారు. కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లో తక్కువగా సాగు చేశారు. నవంబర్, డిసెంబర్‌లలో పత్తి పంట తీసుకొని భూములు దున్ని విత్తనాలు వేస్తున్నారు. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో అధికంగా రైతులు తెల్లజొన్న, శనగ పంట అధికంగా సాగు చేస్తున్నారు.

### జహీరాబాద్, కోహీర్‌లలో అధికంగా కూరగాయల సాగు

జహీరాబాద్, కోహీర్ మండలాల్లో యాసంగిలో రైతులు ఆధికంగా ఆలు గడ్డతోపాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. వానకాలంలో మినుము, సోయా, పెసర పంటలు సాగుచేసిన రైతులు చలికాలంలో ఎక్కువగా ఆలు గడ్డ సాగు చేస్తున్నారు. కొందరు రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. సీజన్‌లో అమ్మకాలు జరిగే కూరగాయలు సాగు చేస్తున్నారు. వంకాయ. టమాట, బెండా, కాకర, బీర, దొండ, గోరుచిక్కుడు, దోస, చిక్కుడుతో పాటు బంతిపూలు సాగు చేస్తున్నారు. పచ్చమిర్చి పంటను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలకు మంచిధర రావడంతో రైతులు యాసంగిలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. సంప్రదాయ సాగులో వస్తున్న నష్టాలతో విసుగు చెందిన రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కొత్త పద్ధతిలో కూరగాయల నారుమడి పెంచి మొక్కలు నాటుతున్నారు. విత్తనం, నారుమడి తయారీ, చీడపీడల యాజమాన్యం , వ్యవసాయ కూలీల ఖర్చులు తగ్గించేందుకు కొత్త పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రైతులు నాణ్యమైన విత్తన రకాన్ని ఎంపిక చేసుకుని సాగు చేస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు పత్తి పంట తీసుకొని కూరగాయలు సాగు చేస్తున్నారు. సరైన సస్యరక్షణ చర్యలు తీసుకొని ఆధిక దిగుబడులు సాధిస్తున్నారు.

### మార్కెట్‌లో తెల్లజొన్నకు పెరిగిన డిమాండ్

బహిరంగ మార్కెట్‌లో తెల్లజొన్నకు మంచిధర ఉండడంతో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటగా వ్యవసాయ బావుల వద్ద సాగు చేస్తున్నారు. సీజన్‌లో రూ. 4 నుంచి 5 వేల వరకు క్వింటాలు అమ్ముతున్నారు. 90 రోజుల్లో తెల్లజొన్న పంట చేతికి వస్తుంది. డిసెంబర్‌లో సాగు చేస్తే మార్చి వరకు పంట తీసుకుంటున్నారు. ఎకరానికి తెల్లజొన్న 10 క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. దీంతో వాతావరణం అనుకులంగా ఉండడంతోపాటు పంట దిగుబడి పెరిగిపోవడంతో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి రైతు వ్యవసాయ బావుల వద్ద తెల్లజొన్న పంట సాగు చేస్తున్నారు. తమ కుటుంబానికి కావాలసి జొన్నలు ఉంచుకొని మిగత జొన్నలను విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.

### కూరగాయల సాగుతో అధిక లాభాలు



యాసంగిలో కూరగాయల సాగుతో అధిక లాభాలు వస్తాయి. మాది ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం. జహీరాబాద్‌లో వ్యవసాయ భూములను లీజుకు తీసుకొని పలు రకాల పూలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. సీజన్ వారీగా కూరగాయలు, పూలు పండించి ప్రతిరోజూ రాజమహేంద్రవరానికి పంపిస్తాం. జహీరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో పంపించి అక్కడ అమ్మకాలు చేస్తున్నాం. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలు, పూలు సాగు చేస్తున్నాం. వ్యవసాయ బావుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో బిందు సేద్యంలో పంటలు సాగు చేస్తున్నాం. తక్కువ నీటితో కూరగాయలు, పూలు పండిస్తున్నాం.

-నాగిరెడ్డి, రైతు, జహీరాబాద్

### ఆరుతడి పంటల సాగు మేలు..



ఆరుతడి పంటలకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో తెల్లజొన్న, శనగతోపాటు వాణిజ్య పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ బావుల వద్ద ఆరుతడి పంటగా సాగు చేస్తున్నారు. పత్తి, సోయా, మినుము, పెసర పంట తీసుకొని రెండో పంటగా శనగ, తెల్లజొన్న, ఆలుగడ్డ, కూరగాయల పంట లు పండిస్తున్నారు. మార్కెట్‌లో అధిక ధర ఉన్న పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- ప్రదీప్‌కుమార్, ఏఈవో జహీరాబాద్



జహీరాబాద్ పట్టణ శివారులో రైతులు సాగుచేస్తున్న చిక్కుడు



రామాయంపేటలో రైసుమిల్లును తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

# లక్ష్యం చేరని సీఎంఆర్..

- మెదక్ జిల్లాలో మిల్లుల్లోనే నిలిచిపోయిన ధాన్యం
- గత ఆర్థిక సంవత్సరం మిల్లింగ్‌కు 6.85 మెట్రిక్ టన్నుల ధాన్యం
- రావాల్సినది 2.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- గడువు ముగిసినా ఇప్పటికీ స్పందన కరువు
- గతంలో జరిమానా విధించినా మారని తీరు
- బ్లాక్ లిస్ట్‌లో ఆరు రైస్ మిల్లులు..
- ఈ నెల 31లోగా సరఫరా చేయాలని ఆదేశాలు

మెదక్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : సీఎంఆర్ రైస్ విషయంలో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద పౌర సరఫరాల శాఖ ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన బియ్యంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువవడంతో సర్కారుకు టోకరా పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి బియ్యం రూపంలో పౌర సరఫరాల శాఖకు నిర్దేశించిన గడువులోగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ గడువు ముగిసినప్పటికీ జిల్లా వ్యాప్తంగా రెండేండ్లుగా కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 2.80 లక్షల టన్నులను మిల్లర్లు తిరిగి ఇవ్వాల్సి ఉంది.

### పెండింగ్‌లో 2.80 లక్షల మెట్రిక్ టన్నులు..

2022-23 వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 6.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి సీఎంఆర్ కోసం మిల్లర్లకు అందజేశారు. వానకాలం సీజన్‌లో 3.86 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగి సీజన్‌లో 2.99 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 160 రైస్ మిల్లులకు కేటాయించారు. 2022-23 వానకాలం సీజన్‌లో 3.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు సరఫరా చేయగా, మిల్లర్లు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లయ్ శాఖకు అందజేయాల్సి ఉన్నప్పటికీ 1.59 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా లక్ష మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 2.99 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించగా, మిల్లర్లు 2.3లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 22,416 మెట్రిక్ టన్నులను మాత్రమే ఇచ్చారు. ఇంకా 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఉంది. మొత్తంగా గతేడాది సంబంధించి 2.80లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం ఇచ్చిన 15 రోజుల్లోగా బియ్యం తిరిగి ఇవ్వాలని నిబంధనలున్నప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

### బ్లాక్ లిస్ట్‌లో ఆరురైస్ మిల్లులు..

మెదక్ జిల్లాలోని 68 రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోటా నిలిపివేయగా, ఆరు రైస్‌మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. నర్సాపూర్‌లోని శ్రీపాద రైస్ ఇండ్రస్టీస్, పెద్దచింతకుంటలోని శ్రీ వెంకటేశ్వర రైస్‌మిల్, శివ్వంపేటలోని శ్రీ లక్ష్మీనర్సింహా రైస్ మిల్, నర్సాపూర్‌లోని శివసాయి రైస్‌మిల్లు, పాపన్నపేటలోని భార్గవ ఇండ్రస్టీస్, మాసాయిపేటలోని చైతన్య రైస్ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్టు పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

### డిసెంబర్ 31లోగా సీఎంఆర్ బియ్యం ఇవ్వాలి..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం ఇచ్చిన 15 రోజుల్లోగా సీఎంఆర్ రైస్ తిరిగి ఇవ్వాలి. రైస్ ఇవ్వడంలో రైస్ మిల్లర్లు జాప్యం చేస్తున్న మాట వాస్తవమే. జిల్లాలో ఇంకా 2.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. డిసెంబర్ 31లోగా పెండింగ్ బియ్యాన్ని ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించాం. ఇప్పటికే 68 రైస్ మిల్లులకు కోటాను నిలిపివేశాం. ఆరు రైస్ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం.

-హరికృష్ణ, మెదక్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి